గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని నెల్లూరు జిల్లా గౌడ, కల్లుగీత పారిశ్రామికుల సంఘ అధ్యక్షుడు ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 450 మార్కులకుపైగా సాధించిన గౌడ విద్యార్థులకు రూ.ఐదు వేలు, మెమెంటో, కాలిక్యులేటర్‌ను అందజేసి తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించనున్నామన్నారు. మార్కుల జాబితా జిరాక్స్ కాపీ, కుల సర్టిఫికెట్, రెండు ఫొటోలు, మొబైల్ నంబర్, చిరునామాతో కూడిన వివరాలను రాజశేఖర్‌గౌడ్, 24 - 3 - 390, మూడో వీధి, సుజాతమ్మ కాలనీ, దర్గామిట్ట, నెల్లూరుకు జూన్ 15లోపు పంపాలని కోరారు. వివరాలకు 81424 42333, 91777 56265 నంబర్లను సంప్రదించాలని సూచించారు. రాజశేఖర్‌గౌడ్, ముత్యంగౌడ్, రామకృష్ణగౌడ్, రామచంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

వైకుంఠపురంలో సీమంతాలు

నెల్లూరు(అర్బన్): మదర్స్ డేను పురస్కరించుకొని నగరంలోని వైకుంఠపురంలో పలువురికి సీమంతాలను విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. చీరలు, పండ్లు, గాజులు, తదితరాలను అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి, సభ్యులు కుసుమ, రమ, రాధమ్మ, రాము పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నిక

నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నికలను గుంటూరులో శనివారం నిర్వహించారు. జిల్లాకు చెందిన ముగ్గురు ఉద్యోగులు రాష్ట్ర పదవులకు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా భీమిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మాబాషా, ప్రచార కార్యదర్శిగా సుబ్బారావు ఎన్నికయ్యారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): జర్నలిస్టులకు అండగా ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో శనివారం నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు చెముడుగుంట ప్రాంతంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేసి స్థలాలిచ్చేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డితో పాటు పలువుర్ని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు షాపులో చోరీ

నెల్లూరు రూరల్: నరుకూరు సెంటర్‌లోని ఓ బంగారు షాపులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బంగారు షాపును నిర్వహిస్తున్న షబ్బీర్ దుకాణానికి శుక్రవారం తాళాలేసి ఇంటికెళ్లారు. తాళాలు పగలగొట్టి ఉండటాన్ని శనివారం ఉదయం ఆయన గమనించారు. వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గుర్తించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన వాటి విలువ రూ.1.7 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని వినతి

నెల్లూరు(బారకాసు): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నేతలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. సంఘ జిల్లా జనరల్ సెక్రటరీ ప్రసాద్, అసోసియేట్ చైర్మన్ శరత్‌బాబు, కో చైర్మన్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ చైతన్యకిషోర్, చిన్నయ్య, శ్రీకాంత్, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం తల్లి అడుగుజాడల్లోనే..



నిరంతరం తల్లి అడుగుజాడల్లోనే ఉంటానని జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మదర్స్ డేను పురస్కరించుకొని ఆయన మాట్లాడారు. తన తల్లి అరుణకుమారి తన ఎదుగుదలకు ఎంతో ప్రోత్సాహం అందించారని చెప్పారు. తనతో పాటు అన్న, అక్క, చెల్లిని ఉన్నత స్థానానికి చేర్చడానికి ఆమె ఎంతో శ్రమించారని తెలిపారు. మదర్స్ డే శుభాకాంక్షలను తెలియజేశారు.

– నెల్లూరు(మినీబైపాస్)

అనుమానాస్పద మృతి

నెల్లూరు రూరల్: దేవరపాళెంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడాన్ని శనివారం గుర్తించారు. స్థానికుల వివరాల మేరకు.. గుడివాడకు చెందిన సరస్వతి మాతాజీ (57) ఎన్నో ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. అప్పట్లో గ్రామానికి చెందిన పెద్దలు ఆశ్రమ ఏర్పాటుకు ఐదెకరాలను ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామ కంఠంలో ఉన్న స్థలాన్ని పూర్తిగా ఇవ్వడం సాధ్యం కాదని రెవెన్యూ అధికారులు పలుమార్లు తెలిపారు. ఈ విషయమై ఆమె అధికారులకు తరచూ ఫిర్యాదు చేసేవారు. ప్రస్తుతం నరసింహకొండ కింది భాగంలోని మెట్ల దారి వద్ద పురాతన ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంటున్నారు. ఇంటి బయట అనుమానాస్పదంగా ముందుకు పడి ముక్కుతో పాటు పలుచోట్ల రక్తం వస్తుండటాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని పరిశీలించారు. అనుమానాస్పద మృతిపై దర్యాప్తు చేస్తున్నారు. విషయమై కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేయనున్నామని పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ యంత్ర సేవా పథకం ప్రారంభం

నెల్లూరు రూరల్: కోడూరుపాడులోని సొసైటీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఉళ్లమ్మతల్లి గ్రూపు రైతులకు రూ.15 లక్షల విలువజేసే వ్యవసాయ పరికరాలను 40 శాతం సబ్సిడీపై అందజేశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కమలాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసులు, ఏఓ నాగమోహన్, సొసైటీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీణాగాన విభావరి

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో వీణాగాన విభావరిని వీనులవిందుగా శనివారం నిర్వహించారు. డాక్టర్ ఎస్బీఎస్ సంగీత కళాపీఠ ఆధ్వర్యంలో వెంకట శ్రీలక్ష్మి శిష్య బృంద నేతృత్వంలో కార్యక్రమాన్ని జరిపారు. శాంతి కళాధర్, ఈశ్వర్‌సాయ్ వాద్య సహకారం అందించారు. శిరోమణిశర్మ, నాగదేవీప్రసాద్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

నెల్లూరు(బృందావనం): హనుమజ్జయంతిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కార్యసిద్ధి ఆంజనేయస్వామి మందిరంలో ఆకు పూజ, తదితరాలను భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. హనుమాన్‌చాలీసా నృత్య రూపకాన్ని గురుకృప కళాక్షేత్ర సురభి గాయత్రి శిష్యబృంద ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పడారుపల్లి సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని బీవీనగర్ సెక్షన్ ఏఈ చిన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పడారుపల్లి, సుందరయ్యకాలనీ, సప్తగిరికాలనీ, దివ్యాంగుల కాలనీ, బీవీనగర్, పాత వేదాయపాళెం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

అన్నదానం

నెల్లూరు(అర్బన్): పాత మున్సిపల్ కార్యాలయ వద్ద గల నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అన్నదానాన్ని ప్రశాంత్ మెమోరియల్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రశాంత్ 17వ వర్ధంతిని పురస్కరించుకొని న్యాయవాది రమాదేవి సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. నారాయణ దంత వైద్య కళాశాల హెచ్ఓడీ నటరాజన్ కణ్ణన్, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, పూర్ణిమ, రాజ్‌కుమార్, బన్నీ, ఆశ్రమ నిర్వాహకుడు సుందరం పాల్గొన్నారు.

నిరసన

నెల్లూరు(వేదాయపాళెం): కేరళ స్టోరీస్ సినిమాను నిషేధించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరాజ్, ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జియా, ఎస్డీపీఐ నేత ఘనీ కోరారు. దర్గామిట్టలోని రెయిన్ స్క్వేర్, ఎంజీబీ మాల్ వద్ద నిరసనను శనివారం చేపట్టారు.